గౌరవ వేతనాల కోసం ఎదురుచూపు

- 24 నెలలుగా అందని వేతనాలు
- ఎంపీటీసీ సభ్యుల ఆవేదన

బుట్టాయగూడెం: వైఎస్సార్ సీపీ హయాంలో ఎంపీటీసీ సభ్యులకు నెలకు రూ.3 వేలు చొప్పున గౌరవ వేతనం చెల్లించేవారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో గత ప్రభుత్వం గౌరవ వేతనాలు చెల్లించలేకపోయింది. జూన్ 2025లో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఎన్నికలకు ముందు పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటు కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు గౌరవ వేతనాల కోసం ఎంపీటీసీ సభ్యులు ఎదురుచూడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు చెల్లించాల్సిన గౌరవ వేతనాలను విడుదల చేయాలని వారు కోరుతున్నారు. పోలవరం నియోజకవర్గంలోని ఏడు మండలాల పరిధిలో సుమారు 92 మంది ఎంపీటీసీ సభ్యులు, వీరితోపాటు ఏడుగురు కోఆప్షన్ సభ్యులు ఉన్నారు. వీరంతా 24 నెలలుగా గౌరవ వేతనం అందక ఇబ్బందులు పడుతున్నారు.



బుట్టాయగూడెం మండల పరిషత్ కార్యాలయం

పోలవరం నియోజకవర్గంలో మొత్తం

ఎంపీటీసీ సభ్యులు	92
మండలం	**ఎంపీటీసీలు**
బుట్టాయగూడెం	15
జీలుగుమిల్లి	9
కొయ్యలగూడెం	21
పోలవరం	14
కుక్కునూరు	10
వేలేరుపాడు	7
టి.నర్సాపురం	16

గౌరవ వేతనం మంజూరు చేయాలి



కూటమి ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వలేదు. దీంతో కొంతమేర ఎంపీటీసీ సభ్యులు ఇబ్బంది పడాల్సివస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం గౌరవ వేతనం మంజూరు చేసి. వెంటనే ఇవ్వాలి.

– గగ్గులోతు మోహన్‌రావు,
వైస్ ఎంపీపీ, బుట్టాయగూడెం మండలం

చిత్తశుద్ధి లేదు



ప్రజాప్రతినిధులంటే కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనాల విడుదలతో తాత్సారం చేస్తోంది. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలి.

– సుంకర వెంకటరెడ్డి,
ఎంపీటీసీల సంఘం చాంబర్ జిల్లా అధ్యక్షుడు, పోలవరం

24 నెలలుగా ఎదురుచూపు



వేతనాల కోసం 24 నెలలుగా ఎదురుచూస్తున్నాం. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉన్న బకాయిలను విడుదల చేయాలి.

– గాలి దుర్గారావు,
కేఆర్‌పురం ఎంపీటీసీ, బుట్టాయగూడెం మండలం

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం



గణిజర్లలో దున్నుకుంటున్న రైతు

- ముందుగా కురవనున్న వర్షాలు
- మెట్ట రైతులు ఆశలు

చింతలపూడి : గత వారం రోజులుగా ఆకాశం మేఘావృత్తమై, అడపాదడపా చినుకులు పడుతుండటంతో ఈ ఏడాది వర్షాలు ముందుగానే పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. రుతుపవనాలు ముందుగానే కేరళను తాకే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో జూన్ మొదటి వారంలోనే వర్షాలు కురిసే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో మెట్ట ప్రాంత రైతులు ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులకు సమాయత్తమవుతున్నారు. పొలాల్లో ఎరువులు తోలుకుని, దుక్కులు దున్నుకుని, నారుమడు లు పో సుకోవడానికి సంసిద్ధమవుతున్నారు. తొలకరి వర్షా లు కురిస్తే వెంటనే విత్తనాలు విత్తుకోవడానికి సిద్ధపడుతున్నారు. వ్యవసాయ శాఖ ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు. ఏటా మే నెల చివర్లో దుక్కులు దున్నుకుని జూన్ 15 నాటికి నారుమడులు పోసి జూలై 15 నాటికి నాట్లు వేయడం పూర్తి చేస్తారు. చింతలపూడి సబ్ డివిజన్‌లో 450 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. ఏటా సుమారు 17,000 వేల హెక్టార్లలో రైతులు వరి పంట సాగు చేస్తారు.

దుక్కులతో లాభాలు

ఖరీఫ్ పంట సాధారణంగా జూన్ నుంచి అక్టోబర్ మధ్య కాలంలో సాగు చేస్తారు. దుక్కులు వేసవి కాలంలో అంటే ఏప్రిల్, మే నెలల్లో చేయాలి. కొన్ని ప్రాంతాల్లో తొలకరి వర్షాలు పడిన వెంటనే దుక్కులు ప్రారంభిస్తారు. దుక్కులు చేయడం వల్ల నేల పై పొర గుల్లగా మారుతుంది. వేర్లు సులభంగా లోతుగా చొచ్చుకుపోతాయి. మొక్కలు బాగా పెరుగుతాయి. గుల్లబారిన నేల నీటిని బాగా పీల్చుకొని నిల్వ ఉంచుకుంటుంది. ఇది వర్షాభావ పరిస్థితుల్లో పంటలకు ఉపయోగపడుతుంది. దుక్కుల వల్ల నేలలో గాలి బాగా ప్రసరిస్తుంది. వేర్ల ఆరోగ్యకరమైన పెరుగుదలకు, నేలలో ఉండే సూక్ష్మజీవుల అభివృద్ధికి సహాయపడుతుంది. వాలుకు అడ్డంగా దుక్కులు చేయడం వల్ల వర్షపు నీరు నేలను కోసుకుపోకుండా అక్కడే ఇంకిపోతుంది.

అందుబాటులో విత్తనాలు



ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాలు వ్యవసాయశాఖ సిద్ధం చేస్తుంది. రుతుపవనాల ప్రభావంతో మెట్ట ప్రాంతంలో వర్షాలు ప్రారంభయ్యే నాటికి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచుతాం.

– బి.నాగకుమార్,
సహాయ సంచాలకులు, వ్యవసాయ శాఖ

అసాంఘిక చర్యలకు పాల్పడితే ఉపేక్షించం



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న డీఎస్పీ రవిచంద్ర, సీఐ, ఎస్సైలు

జంగారెడ్డిగూడెం: యుద్ధ వాతావరణం నేపథ్యంలో డీఎస్పీ యు.రవిచంద్ర ఆధ్వర్యంలో గురువారం అర్ధరాత్రి జంగారెడ్డిగూడెం పట్టణంలో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు శాంతి భద్రతలతో భాగంగా తనిఖీలు చేస్తున్నట్టు చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులు, ఘటనలపై వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ముఖ్యంగా అసాఘింక చర్యలు పాల్పడితే ఉపేక్షించబోమన్నారు. సీఐ వి.కృష్ణబాబు, ఎస్సై షేక్ జబీర్ సిబ్బందితో కలిసి స్థానిక బస్టాండ్ వద్ద, బస్టాండ్ ప్రాంగణంలో తనిఖీలు చేశారు. ప్రయాణికుల లగేజీలను పరిశీలించారు. గంజాయి, మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం వంటి రవాణా, అనుమానాస్పద వస్తువులు వంటి వాటిని పరిశీలించారు.

'నోవా'పై కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్

జంగారెడ్డిగూడెం: విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతోన్న నోవా కాలేజీ యాజమాన్యంపై సుమోటోగా కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి. ఆ కమిటీల సమావేశం జంగారెడ్డిగూడెంలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ అధ్యక్షతన నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం మండలం వేగవరం నోవా కాలేజీ యాజమాన్యం విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని చెప్పారు. దీంతో పోలీసులను ఆశ్రయించిన విద్యార్థులకు సోమవారం తమ సర్టిఫికెట్లు అందిస్తామని వాగ్దానం చేశారని, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ఇప్పించడంతో పాటు, నోవా కాలేజీ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు యశ్వంత్, పి.పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలి ధర పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణచైతన్య

వేలేరుపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి కూలి ధర పెంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల కౌన్సిల్ సభ్యుల సమావేశంలో కృష్ణ చైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావులు మాట్లాడారు. ముందుగా పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం చెందిన జవాన్‌కు నివాళులర్పించారు. ఉపాధి హామీ రోజు కూలి రూ.600 చెల్లించాలన్నారు. పెద్దవాగు ప్రాజెక్టును తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలు సమన్వయంతో వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఎన్నికల హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేసి కూటమి ప్రభుత్వం తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. జూలై 5, 6, 7న చింతలపూడిలో నిర్వహించే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండీ మునీర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్, మండల కార్యదర్శి బాడిశ రాము, కౌన్సిల్ సభ్యులు పిట్టా వీరయ్య, బంధం అర్జున్, మడివి కామయ్య, షేక్ గౌస్, ప్రసాద్, చిన్నమ్మి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా సత్యదేవుని కల్యాణోత్సవం



సత్యదేవుని మూలవిరాట్‌లు



గవరవరంలో సత్యదేవుని కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మండలంలోని గవరవరం శ్రీ రమా సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవాన్ని ఈ నెల 8వ తేదీ రాత్రి ప్రధాన అర్చకులు వాడపల్లి ప్రభాకర రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో భక్త దంపతులు కనులపండువగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం సామూహిక సత్యదేవుని వ్రతాలు మండపంలో నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి అన్న సమారాధన ఏర్పాటుచేశారు. ముగింపు వేడుకగా ఆచార్య పండిత సత్కారం నిర్వహించి వేదాశీర్వాదాలు అందుకున్నారు.

కూలీలకు మజ్జిగ పంపిణీ



ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. సీపీఐ జంగారెడ్డిగూడెం మండలం కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాల యేసు ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి అక్కడ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. బాలయేసు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేలా పని దినాల్ని, కూలి పెంచకుండా రానురాను తగ్గిస్తోందని ఆరోపించారు. గతేడాది బడ్జెట్లో రూ.1,27 వేల కోట్లు కేటాయిస్తే, ఈ ఏడాది రూ.75 వేల కోట్లు మాత్రమే పెట్టారని గుర్తుచేశారు. రోజుకు రూ.500 కూలి ఇవ్వాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుదే ఆశీర్వాదం, నెట్ రామారావు, కుంచె పాప, కలపర్తి భీమార్జున, కుంచే సహోవా, గద్ద వెంకటలక్ష్మి, గోలిమే స్వప్న, ప్రభాకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



రక్త దాతకు ప్రశంసా పత్రం అందిస్తున్న ఎస్పీ

చింతలపూడి : అన్ని దానాల్లోకెల్లా రక్తదానం ఉత్తమమైందని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ కోరారు. స్థానిక ఎం కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నిత్యం రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు సకాలంలో రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. రక్తం దానం చేసి వారి ప్రాణాలను కాపాడాలన్నారు. తలసేమియ వ్యాధిగ్రస్తులకు ప్రతి రోజూ రక్తం అందించి, వారి ప్రాణాలను నిలబెట్టాల్సి వస్తుందని తెలిపారు. శిబిరంలో రక్తదానం చేసిన దాతలను ఎస్పీ అభినందించారు. వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ యు.రవిచంద్ర, ఎస్సై చింతలపూడి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాజశేఖర్, చింతలపూడి ఎస్సై కుటుంబరావు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన

కొయ్యలగూడెం: కిషోరి వికాసం 2.0 కార్యక్రమం గంగన్నగూడెం అంగన్‌వాడీ సెంటర్లలో శుక్రవారం ఐసీడీఎస్ పొంగుటూరు సెక్టార్ సూపర్‌వైజర్ అంబటి సరస్వతీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కిషోర బాలికలకు పోషణ, సమతుల ఆహారం, కౌమార బాలికలలో పోషకాహార లోపం, ఐరన్ లోపం, రక్తహీనత చికిత్స, కౌమార దశలో ఉన్న బాల బాలికల పోషకాహార స్థితి మెరుగు పరిచేందుకు ఉద్దేశించిన ప్రభుత్వ పథకాలపై బాలికలకు అవగాహన కల్పించారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ



కామయ్యకుంటలో తేనె పరిశ్రమ పరికరాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని కామయ్య కుంట, రాజానగరం, చీమలవారిగూడెం, పులిరామన్నగూడెం గ్రామాలకు చెందిన రైతులకు శుక్రవారం ఆచార్య ఎన్‌జీ రంగ వ్యవసాయ విశ్వ విద్యాలయం వారి ఆధ్వర్యంలో అఖిల భారత సమన్వయ తేనె టీగలు, పరాయ సంపర్కం జరుగు కీటకముల పరిశోధనా పథకం ద్వారా ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ సంచాలకులు బుచ్చిబాబు, శాస్త్రవేత్తలు శ్రీనివాసరావు, రమేష్, పీవీ రమణ, మోహన్‌రావులు మాట్లాడుతూ తేనె పరిశ్రమలో ఉపయోగించే పరికరాలు, వివిధ రుతువులతో తేనె పట్టుల యాజమాన్యం, తదితర అంశాలను వివరించారు. ఏడీపీ బుచ్చిబాబు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకానికి సంబంధించి రైతులు నమోదు చేయించుకోవాలని తెలిపారు. ప్రస్తుతం నిర్వహిస్తోన్న పొలాల్లో మట్టి నమూనాల సేకరణకు రైతులు సహకరించాలని కోరారు. అనంతరం గిరిజన ఉపప్రణాళికలతో తేనె పరిశ్రమకు సంబంధించిన పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ డి.ముత్యాలరావు, రైతులు మొట్టెం రమణ, గంగరాజు, కుర్సం పోసీరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూకాలమ్మకు వెండి సమర్పణ



వెండిని అందజేస్తున్న దాతలు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మవారికి వెండి చీర తయారీకి స్థానికులు తడికమళ్ల శివ, సుజాత దంపతులు 20 తులాలు, గాజులపల్లి మాల కొండారెడ్డి, లక్ష్మీ కాంతమ్మ దంపతులు 5 తులాలు వెండిని సమర్పించారని ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుండి ఆలయ యాగశాల నందు వైశాఖ పౌర్ణమి సందర్భంగా 75వ చండీ హోమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. తొలుత ఆలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారని తెలిపారు.

భక్తులకు మందుల విరాళం



విరాళంగా అందించిన మందులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ప్రాణదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ప్రథమచికిత్సా కేంద్రానికి ఒక దాత మూడు వేల మంది భక్తులకు సరిపడా మందులను శుక్రవారం విరాళంగా అందజేశారు. తెనాలికి చెందిన శ్రీశైల భక్త సేవా సమితి కార్యకర్త ఏవీ సాంబశివరావు ఈ మందులను అందించారు. వీటిని బ్రహ్మోత్సవాలకు, పాదయాత్రగా వచ్చే భక్తులకు వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా దాతను ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి, ప్రథమ చికిత్సా కేంద్రం వైద్యుడు రాజేంద్రప్రసాద్‌లు అభినందించారు.

సైనికులకు సంఘీభావం



సైనికులకు అండగా నినదిస్తున్న న్యాయవాదులు

జంగారెడ్డిగూడెం: ఆపరేషన్ సిందూర్ పాకిస్తాన్‌తో వీరోచితంగా పోరాడుతోన్న భారత సైనికులకు సంఘీభావంగా స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం సైనికులకు అండగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ భారత సైనికులకు అందరం మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. బార్ సభ్యులు మోడేపల్లి నాగులు, విత్తనాల రాజు, పొన్న లక్ష్మణరావు, ఎన్‌వీబీఎల్ ఆచారి, టీఎస్ఎన్ మూర్తి, కేవీఆర్, కోటేశ్వరరావు, ఎంజీఆర్, అచ్యుత శ్రీనివాసరావు, జువ్వాల బాబ్జి, రాయి వసంత రావు, రాంబాబు, మాంద్రుమోహన్, వింజమూరి కిరణ్, బొడ్డు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

చింతలపూడి : మే 20న దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు నత్త వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం సీఐటీయూ నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు సమ్మె ఎందుకు చేయాలనే వివరాలతో ముద్రించిన బుక్లెట్‌ను అంగన్‌వాడీ కార్యకర్తలు విడుదల చేశారు. కనీస వేతనాలు, రైతులు పండించిన పంటకు కనీస గిట్టుబాటు ధర కల్పించాలని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచి విస్తరింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రాజెక్ట్ కార్యదర్శి టి.మాణిక్యం, ఏఐటీయూసీ జిల్లా నాయకురాలు గంధం అంజమ్మ, బిఫణి వర్ధిని సరళాదేవి, ఎం అరుణ, సీతామహాలక్ష్మి, పాప రత్నం, ఎం చెన్నకేశ్వరి, మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహారాణా ప్రతాప్ జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

టి.నరసాపురం: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో రాజపుత్ర వీరుడు మహారాణా ప్రతాప్ 486వ జయంతిని బంజారా భజరంగీ బేరి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహారాణా ప్రతాప్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బంజారా భజరంగీ భేరి నాయకులు భూక్యా వేణుగోపాల్ మాట్లాడుతూ రాణా జయంతిని ప్రభుత్వం ఆత్మగౌరవ పోరాటదినంగా నిర్వహించాలని కోరారు. భూక్యా రామకృష్ణ నాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో భూక్యా రాములు నాయక్, భూక్యా బిగనాథం నాయక్ పాల్గొన్నారు.

రేపు నృత్య, సంగీత, ధ్యాన, జ్ఞాన సంబరాలు

జంగారెడ్డిగూడెం: స్థానిక శ్రీగౌరి సుభద్ర పిరమిడ్ ధ్యానమందిర అనుబంధ మైత్రేయ మందిరంలో వైశాఖ పౌర్ణమి పురస్కరించుకొని ఆదివారం బుద్ధ పౌర్ణమి నృత్య, సంగీత, ధ్యాన, జ్ఞాన సంబరాలు 2025 నిర్వహించనున్నట్టు ది జంగారెడ్డిగూడెం పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ శుక్రవారం ప్రకటించింది. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు చిన్నారులచే నృత్య ప్రదర్శన, 7 నుంచి 7.30 గంటల వరకు సీనియర్ పిరమిడ్ మాస్టర్ వై.కృష్ణవేణి (ఈతకోట)చే బుద్ధజయంతి – ఆధ్యాత్మిక విశేషం అనే అంశంపై ప్రసంగం, 7.30 నుంచి 8.30 గంటల వరకు శ్రీ షణ్ముఖ ప్రియ సంగీత అకాడమీ వారిచే వీణాకచేరీ – సామూహిక ధ్యానం, 8.30 నుంచి 9.00 గంటల వరకు అతిథులకు సత్కారం, చిన్నారులకు బహుమతి ప్రదానం, సాత్విక శాకాహార అల్పాహార విందు ఉంటాయని పిరమిడ్ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు కాకి రామకృష్ణ, తటవర్తి కృష్ణ తెలిపారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి తగదు

బుట్టాయగూడెం: సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంట్లో అక్రమంగా సోదాలు చేయడాన్ని నిరసిస్తూ బుట్టాయగూడెం పాత్రికేయ బృందం శుక్రవారం స్థానిక తహసీల్దార్ పీవీ చలపతిరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించకూడదన్నారు. ఇటువంటి చర్యలు పత్రికా స్వేచ్ఛను హరించినట్లుగానే భావించాల్సి వస్తుందని తెలిపారు. రోజురోజుకూ విలేకర్లపై పెరిగిపోతున్న దాడులను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి జక్కుల దాసు, జిల్లా కమిటీ మెంబర్ కె.ఆనంద్, పాత్రికేయులు పాముల మురళి, శీలం కృష్ణమోహన్, కట్టా మధుసూదన్‌బాబు, తలారి దాసు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, వితంతువులకు చీరల పంపిణీ



కిచప్పగూడెంలో చీరల పంపిణీ చేస్తున్న దృశ్యం.

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ దివంగత నేత పోతన శేషగిరిరావు లేనిలోటు పోలవరం నియోజకవర్గానికి తీరనిదని ఆ పార్టీ ఎస్టీ సెల్ మండల కన్వీనర్ కురుసం మురళి, దిప్పకాయలపాడు సర్పంచ్ సున్నం శాంత కుమారిలు పేర్కొన్నారు. శుక్రవారం పోతన శేషు 60వ జయంతి సందర్భంగా కిచప్పగూడెం, వంకాబొత్తప్పగూడెం గిరిజన గ్రామాల్లో 60 మంది వృద్ధులు, వితంతువులకు చీరల పంపిణీ చేశారు. శేషగిరిరావు ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకొని నాయకులు, ప్రజాప్రతినిధులు ముందుకెళ్లాలని సూచించారు. సరియం బసవయ్య, సున్నం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

జంగారెడ్డిగూడెం: జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల పులిసిన బెల్లాన్ని ధ్వంసం చేసి, సిరిబత్తుల శ్రీనివాసరావు అనే వ్యక్తిని అరెస్టు చేసి, 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవత మండల కార్యవర్గం ఎన్నిక



మానవత కొయ్యలగూడెం మండల కార్యవర్గం

కొయ్యలగూడెం: మానవత మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా కన్వీనర్ త్రిపుర సుందరి శుక్రవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా మందపాటి రామకృష్ణ, సెక్రటరీగా తిగిరిపల్లి చంటి, కోశాధికారిగా చవ్వా రామును ఎన్నుకున్నట్టు తెలిపారు. ఈ కార్యవర్గం 2025–26 సంవత్సరానికి సంబంధించి సేవా కార్యక్రమాలలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహించిన అధ్యక్షుడు మాటూరు సుధీర్, సెక్రటరీ కంభంపాటి సాయి, కోశాధికారి ఎం ఉమామహేశ్వరరావులను సన్మానించారు. సంఘ గౌరవ అధ్యక్షులు వీఎస్ఎస్ స్వామి, బొమ్మ మోహన్ తదితరులు పాల్గొన్నారు.